సాక్షి వికారాబాద్

శనివారం । 4 । నవంబర్ । 2023

కమలం.. కల్లోలం

నియోజకవర్గంలో బీజేపీలో అసెంబ్లీ జోష్ తగ్గింది. నేటికీ అభ్యర్థిని ప్రకటించకపోవడంతో ప్రచారంలో వెనుకబడింది. 10లో▸

నేతల పుట్టిల్లు.. చేవెళ్ల

చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రాజకీయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. 10లో▸



అధికారం ఖాయం

ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి, సీఎంగా కేసీఆర్ కొనసాగుతారని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. 11లో▸



కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి తరఫున నామినేషన్ పత్రాలు అందజేస్తున్న గురునాథ్‌రెడ్డి



వికారాబాద్ అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ తరఫున నామినేషన్ వేస్తున్న ప్రసాద్‌కుమార్



పరిగిలో నామినేషన్ దాఖలు చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి శ్రీశైలం

మొదటి రోజు 3

- కొడంగల్ నుంచి రేవంత్‌రెడ్డి తరఫున గురునాథ్‌రెడ్డి..
- వికారాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్..
- పరిగిలో స్వతంత్ర అభ్యర్థిగా శ్రీశైలం నామినేషన్ దాఖలు

అనంతగిరి/కొడంగల్/పరిగి: నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కావడంతో తొలిరోజు వికారాబాద్, కొడంగల్, పరిగి అసెంబ్లీ స్థానాలకు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వికారాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్, కొడంగల్ నుంచి రేవంత్‌రెడ్డి తరఫున గురునాథ్‌రెడ్డి, పరిగిలో స్వతంత్ర అభ్యర్థిగా శ్రీశైలం నామినేషన్ వేశారు. వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్యనాయకులతో కలిసి రెండు సెట్ల నా మినేషన్లు వేశారు. కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, మాజీ చైర్మన్ సత్యనారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్‌నాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు. కొడంగల్ తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తరఫున గురునాథ్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి, నాయకులు కృష్ణంరాజు, ప్రశాంత్, మహ్మద్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు. పరిగిలో స్వతంత్ర అభ్యర్థి శ్రీశైలం నామినేషన్ వేశారు.

న్యూస్‌రీల్

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా శివకుమార్



కొడంగల్: ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొడంగల్ పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం పట్టణంలో జరిగిన ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శివకుమార్ గుప్తా మాట్లాడుతూ.. ఆర్య వైశ్యుల ఆర్థికాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఏ లక్ష్మయ్యగుప్తా, పీ శ్రీనివాస్, బాలేశ్వర్‌గుప్తా, కే శ్రీనివాస్‌గుప్తా, మురళీకృష్ణ, ఎన్ శ్రీనివాస్, ఏ ప్రవీణ్, కే చందు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే మైనార్టీల సంక్షేమం

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి



మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

మర్పల్లి: సీఎం కేసీఆర్‌తోనే ముస్లిం మైనార్టీల సంక్షేమం సాధ్యమని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ ప్రభాకర్ గుప్తా, జెడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, మర్పల్లి పట్టణ అధ్యక్షుడు గౌస్‌తో కలసి ఎంఐఎం మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంఐఎం పోటీ చేయని స్థానాల్లో ఆ పార్టీ నాయకులు బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 50 లక్షల మంది మైనార్టీల సంక్షేమం కోసం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌ను మరో సారి గెలిపించి శాసనసభకు పంపాలని ఆయన మైనార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఆనంద్ గెలిస్తే అండగా ఉంటారని అన్నారు.

సంక్షేమ ఫలాలు అందని ఇల్లు లేదు

ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



పరిగిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: తెలంగాణలో సంక్షేమ ఫలాలు అందని ఇల్లు లేదని, ఇది బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 8వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి బీఆర్ఎస్ పథకాలను ప్రజలకు వివరించారు. తెలంగాణ పథకాలు అద్భుతమని అన్నారు. రైతు బంధు పథకం దేశానికే ఆదర్శమన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలు పొందాలంటే పైరవీలు చేయాల్సి వచ్చేదని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులకు నేరుగా పథకాలు మంజూరు చేస్తోందని తెలిపారు. తనను భారీ మెజారిటీతో శాసనసభకు పంపాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్ రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, జిల్లా కోఆప్షన్ మాజీ మెంబర్ మీర్ మహ్మద్, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, కౌన్సిలర్లు రవీందర్, రవికుమార్, కృష్ణ, వెంకటేష్, మునీర్, మౌలానా పాల్గొన్నారు.

నియమావళి ఉల్లంఘిస్తే కొరడా

- ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం
- కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్: ఎన్నికల నియమావళిని అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని కలెక్టర్ నారాయణరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన ఎస్పీ కోటిరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు ఎన్నికల నిబంధనలను విధిగా పాటించాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ, పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

జిల్లా ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు చేసిన సూచనలు కలెక్టర్ మాటల్లోనే..

- జిల్లాలో 1,133 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాం.
- ఈ నెల 30న జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశాం.
- ఓటింగ్‌కు ఇబ్బంది లేకుండా అవసరమైన ఈవీఎంలు, ఈవీ ప్యాట్‌లను అందుబాటులో ఉంచాం.
- జిల్లాలో నాలుగు నామినేషన్ సెంటర్లు ఏర్పాటు చేశాం.
- ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తాం. ఆదివారం మినహా ప్రతి రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తాం.
- అభ్యర్థులు ఆర్‌ఓల నుంచి నామినేషన్ పత్రాలు, అఫిడవిట్ ఫారాలు పొందవచ్చు.
- నామినేషన్ ఫారం నింపే విషయంలో ఇబ్బందులు ఎదురైతే రిటర్నింగ్ అధికారుల సలహాలు తీసుకోవచ్చు.
- జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు, 9,49,365 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 4,72,159 మంది పురుషులు, 4,77,167 మంది స్త్రీలు, 39 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు.
- చివరి అవకాశంగా గత నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారందరినీ ఓటరు జాబితాలో చేరుస్తున్నాం. ఈ నెల 10న ఓటరు తుది జాబితాకు అనుబంధ జాబితాను విడుదల చేస్తాం.
- ఎన్నికల కోసం ఒక్కో అభ్యర్థి రూ. 40 లక్షల వరకు ఖర్చు చేయవచ్చు. దాన్ని మించితే అనర్హతకు గురవుతారు.
- అభ్యర్థుల ఖర్చులపై నిఘా ఉంచాం.
- ఇందుకోసం జిల్లాకు ఇద్దరు వ్యయ పరిశీలకులు వచ్చారు.
- జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 24 స్టాటిస్టిక్స్ సర్వే లెన్స్ టీంలు పని చేస్తున్నాయి. వీడియో ఎడిటింగ్ సిస్టం అమలు చేస్తున్నాం.
- జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేసేందుకు 20 బృందాలు పని చేస్తున్నాయి.
- కోడ్ ఉల్లంఘనలపై ఇప్పటి వరకు మూడు కేసులు నమోదు చేశాం.
- వాహన తనిఖీల్లో రూ. 1,19,95,600 సీజ్ చేశాం. సరైన పత్రాలు చూపిన వారికి రూ.1.19 కోట్లు తిరిగి ఇచ్చేశాం.
- నాలుగు నియోజకవర్గాల్లో స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేశాం. వాటిలో ఈవీఎంలు, ఈవీ ప్యాట్‌లు భద్రపరిచాం.
- ఈ సారి మూడు రకాల పోస్టల్ బ్యాలెట్లు అందజేస్తున్నాం. ఇందులో ఒకటి 80 సంవత్సరాలు దాటిన వారి కోసం. రెండోది ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగుల కోసం, మూడోది సర్వీస్ ఓటర్ల కోసం. ఇందు కోసం ఈ నెల 8వ తేదీ వరకు ఆర్‌ఓలకు దరఖాస్తు చేసుకోవాలి.
- అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేపడుతున్నాం. గుర్తించిన ప్రదేశాల్లో పోలింగ్ స్టేషన్ల బయట కూడా వీడియో చిత్రీకరణ ఉంటుంది.
- ఈ నెల 30న పోలింగ్, ప్రక్రియ పూర్తి కాగానే ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామగ్రిని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరుస్తాం.

శాంతియుత పోలింగ్‌కు ఏర్పాట్లు: ఎస్పీ కోటిరెడ్డి

- జిల్లాలో శాంతియుతంగా పోలింగ్ నిర్వహించేందుకు భద్రతా పరంగా అన్ని ఏర్పాట్లు చేశాం. సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాల్సి వస్తే ముందుగా అనుమతులు తీసుకోవాలి. లేదంటే కేసులు నమోదు చేస్తాం
- ఇటీవల కర్ణాటక వాసులు ఎలాంటి అనుమతులు లేకుండా కొడంగల్‌లో ర్యాలీ చేస్తే వారిపై కేసులు నమోదు చేశాం. పరిగిలో అనుమతి పొందిన తరువాతే ర్యాలీ నిర్వహించారు.
- జిల్లాకు మూడు కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలు వచ్చాయి. త్వరలో మరో మూడు కంపెనీల బలగాలు రానున్నాయి. స్థానిక పోలీసులతో వీరిని సమన్వయం చేస్తూ భద్రతా ఏర్పాట్లు చూస్తున్నాం.
- ప్రతి రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద డీఎస్పీ స్థాయి అధికారిని నియమించాం.

మద్యం సరఫరాకు సంబంధించి 192 కేసులు నమోదు చేసి 2,300 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నాం.

- జిల్లాలో 1,300 మందిని బైండోవర్ చేశాం. ఇందులో 293 మంది రౌడీ షీటర్లు ఉన్నారు.
- జిల్లాలో 242 లైసెన్స్‌డు తుపాకులు ఉండగా 218 తుపాకులు స్వాధీనం చేసుకున్నాం. మిగిలినవి బ్యాంక్ సెక్యూరిటీ, అత్యవసర సేవల్లో ఉన్నవారి దగ్గర ఉన్నాయి.
- జిల్లాలో 70 నాన్ బెయిలబుల్ వారెంట్లు ఉండగా 40 క్లోజ్ చేశాం. 30 పెండింగ్‌లో ఉన్నాయి.
- డబ్బు మద్యం పంపిణీని అరికట్టేందుకు చర్యలు తీసుకున్నాం. జిల్లాలో 8 అంతర్ జిల్లా, ఏడు అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నాం.

ఆశీర్వదించి అసెంబ్లీకి పంపండి

- ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

అనంతగిరి: మీలో ఒక్కడిలా ఉంటా, తనను ఆదరించి భారీ మెజారిటీతో అసెంబ్లీకి పంపాలని ఎమ్మెల్యే ఆనంద్ కోరారు. శుక్రవారం వికారాబాద్ మండలం మైలార్‌దేవరాంపల్లి, పీలారం, రాళ్ల చిట్టంపల్లి, గోధుమగూడ, జైదుపల్లి, సర్పన్‌పల్లి, ద్యాచారం, గొట్టిముక్ల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికుడైన తనను మరోసారి గెలిపించాలన్నారు. కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికీ ఏదో ఒక రూపంలో లబ్ధి చేకూరిందన్నారు. పైరవీలకు ఆస్కారం లేకండా పథకాలు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే రేషన్‌కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కమాల్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, సర్పంచులు తిరుపతిరెడ్డి, భారతమ్మ, యాస్మిన్ బేగం, అనితగౌడ్, ఎల్లమ్మ, షాకీరా బేగం, అంజయ్య, వెంకటేష్, ఎంపీటీసీ గౌసొద్దీన్, నాయకులు నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

కాంగ్రెస్‌కు ఓటేస్తే 5గంటల కరెంటే

- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

బషీరాబాద్: పొరపాటున కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపిస్తే కర్ణాటకలో మాదిరి వ్యవసాయానికి 5గంటల కరెంటే వస్తుందని, అదే బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉంటే 24గంటల విద్యుత్ సరఫరా ఉంటుందని తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇస్మాయిల్‌పూర్, నీళ్లపల్లి, జలాల్‌పూర్, మర్పల్లి, పర్వత్‌పల్లి, నవల్గా తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లలో తాండూరుకు రూ.1,680 కోట్లు తెచ్చి వివిధ అభివృద్ధి పనులు చేశానని తెలిపారు. తనకు మాత్రమే ఓటు అడిగే హక్కు ఉందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నాన్‌లోకల్ అని.. తాను పక్కా లోకల్ అని రోహిత్‌రెడ్డి అన్నారు. వలస నాయకులు ఓట్ల కోసం వస్తే తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతుబంధు, రైతు బీమా, ఉచిత కరెంట్, పింఛన్లు నిలిచిపోతాయన్నారు. బషీరాబాద్ మండలాన్ని రూ. 68.18 కోట్లతో అభివృద్ధి చేశానని వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, 30 పడకల ఆసుపత్రి కోసం రూ.10 కోట్లు తెచ్చినట్లు వివరించారు. ఏకాంబరి ఆలయ అభివృద్ధికి రూ. కోటి, మండల కేంద్రం అభివృద్ధికి రూ.3 కోట్లు ఇచ్చానని గుర్తు చేశారు. మల్కన్‌గిరి, గంగ్వార్, పర్శ్యానాయక్ తండాలను జీపీలుగా చేశానని పేర్కొన్నారు. మండలంలోని ప్రతి గ్రామానికి రూ. 50లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మాణిక్‌రెడ్డి, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను గద్దె దింపుదాం

- కాంగ్రెస్ పరిగి అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి



అంగడిచిట్టంపల్లిలో పర్యటిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: మోసపూరిత బీఆర్ఎస్ పార్టీని గద్దె దింపుదామని కాంగ్రెస్ పార్టీ పరిగి అసెంబ్లీ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని అంగడిచిట్టంపల్లి, పోతిరెడ్డిగూడ, చన్గోముల్, కుత్బుల్లాపూర్, మిట్టకంకల్, కడుమూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ఆ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కేసీఆర్ పాలనపై విరక్తి చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ. 2లక్షల రుణమాఫీ అమలు చేస్తుందని హామీ ఇచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, ఆరోగ్య శ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యం అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం, డీసీసీ కార్యదర్శులు శ్రీనివాస్, పెంటయ్య, అజీం పటేల్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, మహిళా అధ్యక్షురాలు బాలమణి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం ‘ఆరు గ్యారంటీ’లు

- బీఆర్ఎస్ అవినీతిని ఎండగట్టాలి
- కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డి
- తాండూరులో ప్రచారం




తాండూరులో ప్రచారం చేస్తున్న మనోహర్ రెడ్డి

తాండూరు టౌన్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు ప్రజలకు వరమని ఆ పార్టీ తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. నిజాంషాహీ దర్గా నుంచి ప్రారంభమై పాత తాండూరు మీదుగా బసవన్న కట్ట, గాంధీ చౌక్, భద్రప్ప చౌక్, మార్వాడీ బజార్ వరకు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ అధిష్టానం ఆరు గ్యారంటీలను రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అవినీతి పాలన అంతం కావాలంటే చేయి గుర్తుకు ఓటేయాలని సూచించారు. కమీషన్ల పేరుతో డబ్బులు దండుకొని ప్రాజెక్టులను నాణ్యత లేకుండా నిర్మించారని ఆరోపించారు. నిరుద్యోగులు, యువతకు ఉపాధి కల్పించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చలేదని మండిపడ్డారు. దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు పేరిట ఆయా వర్గాలను దారుణంగా మోసం చేశారని ఆరోపించారు. తాండూరులో అభివృద్ధి ఏమాత్రం జరగలేదన్నారు. ప్రజలకు కావాల్సిన సౌకర్యాలను కల్పించడంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి విఫలమయ్యారని అన్నారు. ఈ సారి ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సర్దార్ ఖాన్, లక్ష్మారెడ్డి, ఎంఏ అలీం, కల్వ సుజాత, హబీబ్‌లాలా, ప్రభాకర్ గౌడ్, బాల్‌రెడ్డి, నీరజ, గాజుల మాధవి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారవృద్ధిలో చీమల్‌దరి ఆదర్శం

- ప్రజల కోసం ఉపాధి మార్గాలను అన్వేషించాలి
- సొంత వనరులు సమకూర్చుకోవాలి
- బీఎస్ఎన్ఎల్ బోర్డు డైరెక్టర్ వివేక్ బంజల్



ఆధార్ కేంద్రం నిర్వాహకుడితో మాట్లాడుతున్న వివేక్ బంజల్

మోమిన్‌పేట: వ్యాపార వృద్ధిలో చీమల్‌దరి గ్రామ పంచాయతీ ఆదర్శంగా నిలిచిందని బీఎస్ఎన్ఎల్ బోర్డు డైరెక్టర్ (సీఎఫ్ఏ, న్యూఢిల్లీ) వివేక్ బంజల్ పేర్కొన్నారు. శుక్రవారం గ్రామంలో బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే మొట్టమొదటిగా బీఎస్ఎన్ఎల్‌లో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్న ఏకైక గ్రామం చీమల్‌దరి అన్నారు. ఒప్పందం కుదుర్చుకున్న నెల రోజుల్లో పంచాయతీకి రూ.47 వేల ఆదాయం వచ్చిందన్నారు. రానున్న కాలంలో వ్యాపారం వృద్ధి చెందితే ప్రతి రీచార్జ్ మీద 50శాతం ఆదాయం పంచాయతీ ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ ఉచిత వైఫై తోపాటు ఇంటర్నెట్ సౌకర్యం, అన్ లిమిటెడ్ కాల్స్‌తో ల్యాండ్ లైన్ ఫోన్ కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. దీంతో పాటు ఉల్కా టీవీ భాగస్వామ్యంతో 360 చానల్స్ చూసే వెసులుబాటు ఉంటుందని వివరించారు. పంచాయతీలు ప్రభుత్వ గ్రాంట్లపై ఆధార పడకుండా సొంత వనరులు సమకూర్చుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో అంతా డిజిటలైజేషన్ అవుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని పంచాయతీలు ప్రజలకు ముందుగానే ఆన్‌లైన్ సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ప్రజల కోసం ఉపాధి మార్గాలను అన్వేషించాలని ఆయన సూచించారు. పిల్లల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం గ్రామంలోని ఉన్నత పాఠశాలలో డిజిటల్ తరగతులను పరిశీలించారు. అంతకుముందు ప్రధాన కూడలిలోని గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ స్టేట్ సర్కిల్ సీజీఎం చాగంటి శ్రీనివాస్, టెలికం సిబ్బంది, ఎంపీడీఓ శైలజారెడ్డి, ఎంపీఓ యాదగిరి, కార్యదర్శి సుగుణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాండూరులో తొలిరోజు నిల్

మూడు వాహనాలు..

ఐదుగురు వ్యక్తులకు అనుమతి

తాండూరు టౌన్: ఎన్నికల ప్రక్రియలో భాగంగా శుక్రవారం నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలైంది. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఇందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ నెల 10 వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ దాఖలు చేయవచ్చునని వివరించారు. నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థుల మూడువాహనాలకు అనుమతి ఉంటుందన్నారు. ఆర్వో కార్యాలయానికి వంద మీటర్ల దూరంలోనే వాహనాలు నిలపాలన్నారు. ఐదుగురికి మాత్రమే రిటర్నింగ్ అధికారి వద్దకు వచ్చి నామినేషన్ దాఖలు చేసేందుకు అనుమతి ఉటుందని వివరించారు. పోటీలో నిలిచే అభ్యర్థులు కొత్త బ్యాంకు ఖాతా తెరవాలని, తమపై ఉన్న క్రిమినల్ కేసుల వివరాలు, విద్యార్హత, స్థిర, చరాస్తుల వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాలన్నారు.

బీజేపీ పెద్దలు టికెట్ అమ్ముకున్నారు

పాలమూరు ట్రస్టు ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: 'పార్టీ బలోపేతం కోసం ఎంతో శ్రమించా.. పేదల అభ్యున్నతికి సేవా కార్యక్రమాలు చేపట్టా.. కొంతమంది నాపై కుట్రలు పన్ని టికెట్ రాకుండా చేశారు.. బీజేపీ పెద్దలు షాద్‌నగర్ టికెట్ అమ్ముకున్నారు' అని పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన తన మద్దతుదారులతో కలిసి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. తనకు టికెట్ ఎందుకు ఇవ్వలేదో.. బీజేపీ పెద్దలు చెప్పాలని డిమాండ్ చేశారు. తన ట్రస్టు ఆధ్వర్యంలో నియోజకవర్గ ప్రజలకు ఎంతో సేవ చేశానని గుర్తు చేశారు. షాద్‌నగర్‌లో ఐదువేల ఓటు బ్యాంకు ఉన్న బీజేపీని బలమైన శక్తిగా మార్చేందుకు ఎంతో కృషిచేశానని చెప్పారు. పేదల సంక్షేమ కోసం, పార్టీ అభివృద్ధి కోసం ట్రస్టు ఆధ్వర్యంలో ఇప్పటి వరకు రూ.27 కోట్లు ఖర్చు చేశానని వివరించారు. అందరూ ఆశీర్వదిస్తే ఇండిపెండెంట్‌గా బరిలో ఉంటానని వెల్లడించారు. ఇక నుంచి జెండాలు, ఎజెండాలు పక్కన పెట్టి ప్రజల ఎజెండానే తన జెండాగా సాగుతానన్నారు. నామినేషన్ వేసిన రోజు తన సగం ఆస్తిని ప్రజలకు రాసిస్తానని ప్రకటించారు.



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కమలం.. కల్లోలం

తాండూరు టికెట్ ప్రకటనలో ఆలస్యం

- ఆందోళనలో ఆశావహులు
- జనసేనకు కేటాయిస్తారంటూ ప్రచారం
- అయోమయంలో కేడర్

తాండూరు: నియోజకవర్గంలో బీజేపీలో అసెంబ్లీ జోష్ తగ్గింది. నేటికీ అభ్యర్థిని ప్రకటించకపోవడంతో కమల దళం ప్రచారంలో వెనుకబడింది. నాలుగు నెలల క్రితం నియోజకవర్గంలో బలమైన శక్తిగా తయారైన పార్టీ రాష్ట్ర అధినాయకత్వలోపం కారణంగా వచ్చిన హైప్ తగ్గిపోయింది. దీనికి తోడు రాష్ట్ర స్థాయి నేతలు తమ అనుచరులకే టికెట్ కేటాయించాలని కోరుతుండడంతో అభ్యర్థి ప్రకటన మరింత ఆలస్యమవుతోంది. ముగ్గురికి కాకుండా పొత్తులో భాగంగా జనసేనకు టికెట్ కేటాయించే దిశలో పార్టీ పెద్దలు ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఇదే జరిగితే ఏళ్ల నుంచి జెండాలు మోస్తున్న నేతలు సైతం పార్టీ మారడం పక్కా అనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

పట్టువీడని రాష్ట్రస్థాయి నేతలు

నియోజకవర్గంలో ముగ్గురు నేతలు పార్టీ టికెట్ కోసం పోటీ పడుతున్నారు. వీరు ముగ్గురు రాష్ట్ర స్థాయిలో బలంగా ఉన్న ముగ్గురు నేతలకు ముఖ్య అనుచరులు. దీంతో టికెట్ పంచాయితీ తేలడం లేదు. కమలం టికెట్ కోసం మాజీ మంత్రి చంద్రశేఖర్‌రావు తనయుడు మల్కూడ్ నరేశ్ మహరాజ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రమేశ్‌కుమార్, గతంలో కమలంపై పోటీ చేసిన పటేల్ రవిశంకర్ సతీమణి పటేల్ జయశ్రీలు టికెట్ రేసులో ఉన్నారు. నరేశ్ మహరాజ్ ఈటల వర్గంలో, రమేశ్‌కుమార్ బండి సంజయ్ వర్గంలో ఉండగా.. లక్ష్మణ్ వర్గంలో పటేల్ జయశ్రీ ఉన్నారు. ఈ ముగ్గురు ముఖ్యుల తమవారికే టికెట్ ఇవ్వాలని పట్టుపడుతుండడంతో అభ్యర్థిత్వం ప్రకటనలో ఆలస్యమవుతోంది.

మా ఇద్దరిలో ఎవరికి ఇచ్చినా ఓకే

నియోజకవర్గం నుంచి కమలం టికెట్ ఎవరికి ఇచ్చినా కలిసి పనిచేస్తామని నరేశ్ మహరాజ్, రమేశ్‌కుమార్‌లు వెల్లడిస్తున్నారు. పార్టీకి బలమైన కేడర్ ఉందని టికెట్ ప్రకటించక ప్రచారానికి ఆలస్యమవుతోందని ఆ పార్టీ నేతలు ఆందోళన చెందుతున్నారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి టికెట్ ఇవ్వాలంటే నరేశ్ మహరాజ్‌కు అవకాశం ఉందని.. పార్టీని కష్టకాలంలో నడిపించిన వ్యక్తి రమేశ్‌కుమార్ కే అవకాశం ఉందనే చర్చలు సాగుతున్నాయి.

కాదంటే చెప్పండి.. 'కొండా'

చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ఉన్న తాండూరు, శేరిలింగ్‌పల్లి టికెట్‌ను బీజేపీకే కేటాయించాలని మాజీ విశ్వేశ్వర్‌రెడ్డి పట్టుపడుతున్నారు. కేడర్ లేని జనసేనకు టికెట్ ఇస్తే ఫలితం లేకపోగా నష్టం చేకూరుతుందని అధిష్టానానికి చెప్పినట్లు సమాచారం. కాదని జనసేనకు కేటాయిస్తే తాము పార్టీ వీడుతామని స్పష్టం చేశారని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

మహిళా కోటాలో జయశ్రీ

తాండూరు అసెంబ్లీ స్థానాన్ని మహిళలకు కేటాయించాలని అధిష్టాన నేతలు భావిస్తే పటేల్ జయశ్రీకి టికెట్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మణ్.. పటేల్ జయశ్రీకి టికెట్ ఇప్పించేందుకు యత్నిస్తున్నట్లు పార్టీ కేడర్ చర్చించుకుంటోంది. ఒక వేళ జనసేనకు టికెట్ ఇవ్వాలనుకుంటే ఆమె పార్టీ మారైనా టికెట్ తెచ్చుకునేందుకు యత్నిస్తున్నట్లు వినికిడి.

ప్రచారంలో ప్రధాన పార్టీలు

అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నాయి. ఇరు పార్టీల నేతలు విమర్శలు, ప్రతి విమర్శలతో రాజకీయాలను వేడిపుట్టిస్తున్నారు. కమలం నేతలు నేటికీ ప్రచారం ప్రారంభించలేదు.



యు.రమేష్ కుమార్





పటేల్ జయశ్రీ



నరేష్ మహరాజ్

నియోజకవర్గంలో నాలుగు నెలల క్రితం బీజేపీ చూపిన రువ్వడితో 'కారు'కు ప్రత్యామ్నాయం 'కమల'మేనని అంతా చర్చించుకున్నారు. పార్టీ పెద్దలతో పాటుగా ద్వితీయ శ్రేణి నాయకులు పార్టీ బలోపేతంపై దృష్టి సారించారు. నామినేషన్ల ప్రక్రియ మొదలైనా నేటికీ టికెట్ కేటయించకపోవడంతో ఆశావహులు అందోళన చెందుతున్నారు. పలువురు నేతలు పక్క చూపులు చూస్తున్నారని సమాచారం.

నేతల పుట్టిల్లు చేవెళ్ల

- ఉమ్మడి జిల్లాలో చక్రం తిప్పతున్న అమాత్యులు
- అసెంబ్లీ బరిలో ఆరుగురు అభ్యర్థులు


ఎన్నికలనగానే ప్రజల చూపంతా చేవెళ్ల అసెంబ్లీ వైపే.. ఢిల్లీ నుంచి గల్లీ వరకు ఈ సెగ్మెంట్‌పై స్పెషల్ ఫోకస్ చేస్తుంటారు. ఇక్కడ ప్రజలిచ్చే తీర్పునకు అంతటి ప్రత్యేకత ఉంది. ఇక్కడ ఓటర్లు తయారు చేసిన నేతలు ప్రస్తుతం జిల్లాలోని ఆరు సెగ్మెంట్లలో పోటీలో ఉన్నారు.

పార్టీల వారీగా పోటీలో ఉన్నవారు	
కాంగ్రెస్	2
బీఆర్‌ఎస్	3
బీజేపీ	1

చేవెళ్ల: చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. నగరానికి ఆనుకొని ఉన్న ఈ నియోజకవర్గం రాజకీయ చైతన్యానికి ప్రసిద్ధి. ఓటర్లలో చైతన్యంలోనూ.. జిల్లా వ్యాప్తంగా రాజకీయ నాయకులను అందించడంలోనూ.. విశిష్టమైన గుర్తింపు పొందింది. ఇక్కడి నేతలు పక్క నియోజకవర్గాల్లోనూ తమ ప్రాబల్యం చూపుతూ.. అమాత్య పదవుల్లో ఉన్నారు. ఈ నియోజకవర్గాన్ని పటోళ్ల, పట్నం కుటుంబాలు కంచుకోటగా మార్చుకున్నాయి. సబితారెడ్డి మూడు పర్యాయాలు, మహేందర్‌రెడ్డి రెండు సార్లు మంత్రి పదవిని దక్కించుకున్నారు. వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి సైతం నియోజకవర్గానికి చెందిన వారే. చేవెళ్ల గడ్డ నేతల అడ్డాగా తన ప్రత్యేకతను చాటుతూనే ఉంది.



పట్నం మహేందర్‌రెడ్డి, మంత్రి



పట్నం మహేందర్‌రెడ్డి స్వగ్రామం షాబాద్ మండలంలోని గొల్లూరుగూడ స్వగ్రామం. మేనమామ దివంగత ఇంద్రారెడ్డి ప్రోత్సాహంతో 1994లో టీడీపీ నుంచి తాండూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసి అనూహ్యంగా గెలుపొందారు. ఆ తరువాత 1999లో వరుసగా రెండవసారి గెలిచారు. 2004లో ఓటమి చెందగా.. తిరిగి 2009, 2014 ఎన్నికల్లో విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్రంలో తొలి రవాణశాఖ మంత్రిగా పనిచేశారు. ఉమ్మడి జిల్లాను శాసించే నాయకుడిగా ఎదిగారు. 2018లో తాండూరు నుంచి పోటీ చేసి ఓటమి చెందడంతో తన తమ్ముడు నరేందర్‌రెడ్డి ఎమ్మెల్సీ స్థానంలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం మంత్రిగా జిల్లా రాజకీయల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు.

పటోళ్ల సబితారెడ్డి, బీఆర్‌ఎస్ మహేశ్వరం ఎమ్మెల్యే అభ్యర్థి



నియోజకవర్గ కేంద్రంలోని కౌకుంట్ల సబితారెడ్డి స్వగ్రామం. ప్రస్తుతం ఆమె మహేశ్వరం సెగ్మెంట్ నుంచి బీఆర్‌ఎస్ నుంచి పోటీలో ఉన్నారు. 2000 ఏప్రిల్ 22న తన భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పి.ఇంద్రారెడ్డి వారసురాలిగా అప్పటి ప్రతిపక్ష నేత రాజశేఖర్‌రెడ్డి ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చారు. నియోజవకర్గ చరిత్రలో జరిగిన ఏకైక ఉప ఎన్నికలో ఆమె కాంగ్రెస్ నుంచి పోటీ చేసి అసెంబ్లీ మెట్లెక్కారు. అనంతరం 2004 సాధారణ ఎన్నికలోనూ చేవెళ్ల నుంచి గెలిచిన ఆమె వైఎస్సార్ మంత్రివర్గంలో భూగర్భ, జలవనరుల శాఖామంత్రి పదవి చేపట్టారు. అనంతరం 2009లో జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో నియోజకవర్గాల పునర్విభజనలో చేవెళ్ల నియోజకవర్గం ఎస్సీ రిజర్డ్వ్‌గా మారడంతో ఆమె నియోజకవర్గాన్ని వదలాల్సి వచ్చింది. అప్పటి సీఎం వైఎస్సార్ సూచన మేరకు జిల్లాలోని మహేశ్వరం నియోజకవర్గం నుంచి పోటీచేసి దేశంలోనే మొదటి హోం మంత్రిగా రికార్డుకెక్కారు. అనంతరం 2014లో పోటీకి దూరంగా ఉన్నారు. 2018లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొంది అధికార బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రస్తుతం విద్యాశాఖ మంత్రిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం 2023 ఎన్నికల్లో మహేశ్వరం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు.

కేఎల్ఆర్, కాంగ్రెస్ మహేశ్వరం ఎమ్మెల్యే అభ్యర్థి




కేఎల్ఆర్ స్వగ్రామం శంకర్‌పల్లి మండల పరిధిలోని మాసానిగూడ. ఈయన సికింద్రాబాద్ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా కొంత కాలం పనిచేసి.. అనంతరం బోర్‌వెల్స్ పరికరాలు తయారు చేసే ఫ్యాక్టరీ స్థాపించి వ్యాపారవేత్తగా ఎదిగారు. తన మిత్రుడు పి.ఇంద్రారెడ్డితో విభేదించి రాజకీయాల్లోకి వచ్చారు. 1999లో చేవెళ్ల టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2000 జరిగిన ఉప ఎన్నికలో సబితారెడ్డిపై పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. దీంతో ఆయన కొంతకాలం రాజకీయాలకు దూరంగా ఉన్నారు. అనతరం వైఎస్సార్ సూచన మేరకు 2009లో మేడ్చల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఖాతా తెరిచారు. ప్రత్యేక రాష్ట్రంలో జరిగిన 2014, 2018 ఎన్నికల్లో మళ్లీ ఓటమి చెందారు. ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు. చేవెళ్ల నియోజకవర్గం బరిలో ప్రత్యర్థులుగా ఉన్న సబితారెడ్డి, కేఎల్ఆర్ ప్రస్తుతం మహేశ్వరం సెగ్మెంట్‌లో చేవెళ్ల ప్రాంతవాసులుగా ప్రత్యర్థులుగా మారారు.

పామెన భీంభరత్, కాంగ్రెస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి




షాబాద్ మండలం నారెడ్లగూడకు చెందిన పామెన భీంభరత్ తొలిసారి నియోజకవర్గం నుంచి అసెంబ్లీ రేసులో నిలిచారు. ఏళ్ల నుంచి హస్తం పార్టీకి పనిచేస్తుండగా ఈ ఎన్నికల్లో అభ్యర్థిగా అవకాశం దక్కింది. ఈ ఎన్నికల్లో పామెన విజయం సాధిస్తే చేవెళ్ల నుంచి మరో నాయకుడు వచ్చినట్లే. ప్రస్తుతం ఆరుగురు ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఉమ్మడి జిల్లాలోని చేవెళ్ల, మహేశ్వరం, కొండగల్ నియోజకవర్గాలలో శాసనసభ బరిలో నిలిచారు.

పట్నం నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ కొడంగల్ ఎమ్మెల్యే అభ్యర్థి



పట్నం మహేందర్‌రెడ్డి సోదరుడు పట్నం నరేందర్‌రెడ్డి. ప్రస్తుతం ఆయన కొంగడల్ ఎమ్మెల్యే. ఈయనది షాబాద్ మండలంలోని గొల్లూరుగూడ స్వగ్రామం. స్థానిక సంస్థల నుంచి ఎంపీపీగా, పీఏసీఎస్ చైర్మన్‌గా రాజకీయ అడుగులు వేశారు. 2010లో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్సీగా గెలుపొందారు. ఎమ్మెల్సీగా ఉన్న ఆయన్ను 2018లో టీఆర్‌ఎస్ కొండగల్ అసెంబ్లీ స్థానంలో పోటీ చేయించారు. ఉమ్మడి జిల్లాలో కొత్తగా కలిసి కొడంగల్‌లో చేవెళ్ల నియోజకవర్గ నాయకుడు నరేందర్‌రెడ్డి రేవంత్‌రెడ్డిపై గెలుపొంది గులాబీ జెండా ఎగురవేశారు. ప్రస్తుతం పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డిపై రెండోసారి బరిలో నిలుస్తున్నారు.

కేఎస్.రత్నం, బీజేపీ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి



కొరగాని సాయన్న రత్నం మొయినాబాద్ మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి వాసి. ప్రస్తుతం ఆయన చేవెళ్ల బీజేపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. 1995లో రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఎస్సీలకు రిజర్వు కావడంతో తెలుగుదేశం పార్టీలోకి తీసుకొచ్చారు. ఇంద్రారెడ్డి అనుచరుడిగా శంషాబాద్ జెడ్పీటీసీ సభ్యుడిగా పోటీచేయించి జెడ్పీచైర్మన్ పదవిని కట్టబెట్టారు. నియోజకవర్గ పునర్విభజనలో చేవెళ్ల స్థానం ఎస్సీ రిజర్డ్వ్ కావడంతో టీడీపీ టికెట్‌పై శాసనసభకు ఎన్నికయ్యారు. 2014లో టీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2018లో కాంగ్రెస్ నుంచి ఓడిపోయి తిరిగి గులాబీగూటికి చేరారు. 2023లో టికెట్ దక్కకపోవడంతో ఆయన బీజేపీలో చేరి కమలం గుర్తుపై పోటీ చేస్తున్నారు.

కాలె యాదయ్య, బీఆర్‌ఎస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి



ప్రస్తుతం వికారాబాద్ జిల్లాలోని నవాబుపేట మండలం చించల్‌పేటకు చెందిన కాలె యాదయ్య స్థానిక సంస్థల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. నియోజకవర్గం ఎస్సీకి రిజర్డ్వ్ కావడంతో హస్తం గుర్తుపై పోటీ చేసి ఓటమి చెందారు. 2014లో టీఆర్ఎస్ నుంచి బరిలో ఉన్న కేఎస్ రత్నంపై కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు. అనంతరం ఆయన కారెక్కారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ నుంచి పోటీలో నిలిచారు. హ్యాట్రిక్ విజయం కోసం శ్రమిస్తున్నాడు.

పైలట్ కోసం 'ఆర్తి'



చాయ్ అందిస్తూ ఓటు అభ్యర్థిస్తున్న ఆర్తిరెడ్డి

బీఆర్‌ఎస్ తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి పైలట్ రోహిత్‌రెడ్డి సతీమణి ఆర్తిరెడ్డి శుక్రవారం పట్టణంలోని పలువార్డుల్లో ప్రచారం నిర్వహించారు. టౌన్‌లో ఉన్న ఓ హోటల్ వద్ద ఆమె కార్యకర్తలకు, ప్రజలకు చాయ్ అందించారు. ఆమె చిరునవ్వుతో చాయ్ తాగేయ్.. ఓటు వేసేయ్ అంటూ ఆకట్టుకున్నారు. గిరిజనులు అందించిన సంప్రదాయ దుస్తులు ధరించి ఓటు అభ్యర్థించారు. బ్యాట్ పట్టి యువతలో ఉత్సాహాన్ని నింపారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సైతం ×అప్పుడెట్లున్నది తెలంగాణ...ఇప్పుడెట్లున్నది తెలంగాణ× అంటూ ప్రాస గీతానికి తీన్‌మార్ స్టెప్పులు వేసి కేడర్‌లో జోష్ నింపారు.

– తాండూరు టౌన్

కాంగ్రెస్‌లో చేరికల జోష్



బషీరాబాద్: ప్రియాంకకు కాంగ్రెస్ కండువా కప్పుతున్న మనోహర్‌రెడ్డి

నియోజకవర్గ కాంగ్రెస్‌లో చేరికల జోష్ కొనసాగుతోంది. శుక్రవారం తాండూరు కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యని మనోహర్ రెడ్డి ప్రచారంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షురాలు ప్రియాంక, బీఆర్‌ఎస్ కౌన్సిలర్ రత్నమాల, మాజీ కౌన్సిలర్ నర్సింలు తన అనుచరులతో కలిసి హస్తం తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.



తాండూరు టౌన్: కాంగ్రెస్‌లో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ రత్నమాల, మాజీ కౌన్సిలర్ నర్సింలు

'కారు'కే ఓటేయండి



తాండూరు టౌన్: కార్యకర్తల సమావేశానికి హాజరైన గులాబీ శ్రేణులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి